క్లుప్తంగా

అందరి చూపు కాంగ్రెస్ వైపు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆవుల రాజిరెడ్డి, ఇతర నాయకులు

నర్సాపూర్: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులు చూసి అందరి చూపు కాంగ్రెస్ వైపు ఉందని, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని గోవింద్‌రాజ్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు శ్రీశైలం, రాజు, సాయి తదితరులు రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకులు మల్లేశ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అశోక్, మణిదీప్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన అందించాలి



మాట్లాడుతున్న సోమిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూడూర్‌లో ఉన్న కస్తూర్బా బాలికల వసతిగృహన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఇంగ్లీష్‌లో బోధించడంతో పాటు సైన్స్ ల్యాబ్‌ని ఉపయోగించి పాఠాలు చెప్పాలని సూచించారు. విద్యార్థులు దారాలంగా చదివేటట్లు లైబ్రరీ బుక్స్ ఉపయోగించుకొని, ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ బుచ్చనాయక్, తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు



జనుము పంటను పరిశీలిస్తున్న ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుందని ఏఓ స్వప్న తెలిపారు. బుధవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో రైతు నర్సింలు సాగుచేస్తున్న జనుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట జనుము, జీలుగు పంట సాగుచేసి కనీసం 45రోజుల తర్వాత భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, రైతు నర్సింలు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



ఉత్సవంలో ఆర్యవైశ్య మహిళలు

రామాయంపేట(మెదక్): ఆషాడమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వన భోజనాలతో పాటు గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభకు చెందిన మహిళా ప్రతినిధులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి, కార్యదర్శి లావణ్య, కోశాధికారి శ్యామల, పీఆర్‌వో మౌళిక, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీకాంత్ యాదవ్

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గడ్డమీద శ్రీకాంత్ యాదవ్‌ను నియమించారు. బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ కలిసి నియామక పత్రాన్ని అతనికి అందజేశారు.కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నీలి నాగేష్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్లతో రైతులకు వరం

- నిర్మించిన వెంటనే బిల్లులు
- సద్వినియోగం చేసుకోవాలి: ఏపీఓ జగన్మోహన్ సింగ్



కొత్వాన్‌పల్లిలో రైతు నిర్మించుకున్న పశువుల షెడ్డు

రేగోడ్(మెదక్): రైతులు సాగుతో పాటు పశువులను సైతం పెంచుతున్నారు. పశువుల సంరక్షణ కోసం కొట్టాలు వేసేవారు. వేసవికాలంలో కొన్ని కొట్టాలు ప్రమాదవశాత్తు కాలిపోయేవి. సొంతంగా కొట్టాలు ఏర్పాటు చేసుకోవాలంటే రైతులకు భారంగా మారేది. అలాంటి పరిస్థితుల్లో రైతులు, రైతు కూలీలను ఆదుకునేందుకు కేంద్రం ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో లక్షలాది మంది కూలీలు పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. దీనిలో భాగంగా రైతుల కోసం పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో పశువుల షెడ్డుకు రూ.54 వేలను మంజూరు చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడేలా పశువుల షెడ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తోంది. పశువుల షెడ్లను నిర్మించిన వెంటనే బిల్లులు కూడా మంజూరు చేస్తున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో ఎక్కువగా రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు.

షెడ్ల నిర్మాణంతో ఉపయోగం

పశువుల షెడ్ల నిర్మాణంతో రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంది. మండలంలో సుమారు ఇరవై మంది రైతులకు షెడ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా.. పదిహేను మంది రైతులు పశువుల షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీరికి అధికారులు బిల్లులను మంజూరు చేశారు. నిర్మించిన పశువుల షెడ్లలో పశువులతో పాటు వ్యవసాయ సామగ్రిని కూడా ఉంచడం వలన ఇబ్బందులు తప్పనున్నాయి.

భారం తగ్గింది



షెడ్డులేక పశువులను ఉంచడానికి ఇబ్బంది పడేవాళ్లం. సొంతంగా వేద్దామనుకున్నా కుదరలేదు. ఈ క్రమంలోనే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నన్ను ఆదుకుంది. ఈజీఎస్ ద్వారా పశువుల షెడ్డును వేసుకోవడం వలన ఎంతో మేలు చేకూరింది.

– నగేశ్, రైతు, కొండాపురం

వెంటనే బిల్లు మంజూరు చేస్తాం



పశువుల షెడ్లను నిర్మించుకున్న వెంటనే బిల్లు మంజూరు చేస్తాం. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.54వేలు మంజూరు చేస్తాం. పశువులు ఉన్న రైతులు నిర్మించుకుంటే ఎంతో మేలు చేకూరుతుంది. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జగన్మోహన్ సింగ్, ఏపీఓ, రేగోడ్

ప్రతీ మొక్కను సంరక్షించాలి



చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగల్‌లో వన మహోత్సవాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి ఆనంద్



దొంతి మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా

చిలప్‌చెడ్(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్యదర్శులు ఆనంద్, తిరుపతి అన్నారు. బుధవారం వారు మండలంలోని బండపోతుగల్, చిట్కుల్ గ్రామాల్లో ప్రారంభించిన వనమహోత్సవాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ ప్రదేశాల్లో ఏఏ మొక్కలు నాటాలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, ఉపాధి కూలీలకు సూచించామన్నారు.

మొక్కల పరిరక్షణకు కృషి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా అన్నారు. వన మహోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వనమహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ప్రారంభించనున్న వనమహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా ఈజీఎస్ సిబ్బందికి, గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫాం పాండ్, షిప్‌ఫాండ్, పండ్ల తోటలు, పశువులషెడ్ తదితర కార్యక్రమాలపై గ్రామాల్లో ప్రజలకు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవగాహన కల్పించాలని, వనమహోత్సవానికి చెట్లను సిద్ధంగా ఉంచాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): వన మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటేందుకు స్థలం గుర్తించి గుంతలు తీసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్, టీఏలు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

తూప్రాన్: వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహంకాళి బోనాల ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజామోహియొద్దీన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, మెనేజర్ రఘువరన్, ఏఈ సాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బేషరతుగా ‘మాఫీ’ చేయాలి



డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): రైతులపై ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టేక్మాల్ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాన్ని బేషరతుగా మాఫీ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కౌలు రైతులకు సైతం ఎన్నికల సమయంలో ప్రభుత్వం చెప్పిన విధంగా ఎడాదికి రూ.15వేలు ఆర్థిక సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి పంటల బీమా యోజనను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందులో మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, మండల ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నిజాంపేటలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ సురేశ్‌కుమార్ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. పాఠశాల పిల్లలకు భోజనంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని హెచ్‌ఎంలకు, వంట వాళ్లకు చెప్పారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. పిల్లలు వాడుకునే మురికి నీరును బయట ఉండడం వలన దోమలు, ఈగలు పెరిగే అవకాశం ఉందని, కావున మురికి నీరు కోసం ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్ఞానమాల, ఆర్‌ఐ గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్



మాట్లాడుతున్న అధ్యాపకుడు

మెదక్ కలెక్టరేట్: మెరుగైన వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలు కళాశాలకు వచ్చేలా చూడాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డులలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాలలో ఉన్న వివిధ వసతులను, అకాడమిక్ కార్యక్రమాలను వివరించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. కళాశాలలో ఉన్న అవకాశాలు, ప్రణాళికలను వివరించారు. త్వరలో నిర్వహించబోయే జాబ్ మేళా విశేషాలను, ఇంటర్వ్యూలకు మెలుకువలు నేర్పే టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.తిరుమలరెడ్డి, జిమ్, స్పోర్ట్స్ సౌకర్యాలపై ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, విభాగాధిపతి డాక్టర్ శరత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వెంకగోని పెంటగౌడ్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఎం సహాయనిధి నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ రాజిరెడ్డి రూ 2.50లక్షల ఎల్‌ఓసీని బాధితుని తమ్ముడు అంజాగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

జిల్లా వ్యాప్తంగా బుధవారం జీపీ కార్మికులు, ఆశ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఆయా పట్టణాల్లో, గ్రామాల్లో కార్మికుల చట్టాలను అమలు చేయాలని నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్మిక నాయకులు ఉన్నారు.



నర్సాపూర్: నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా రంగాల కార్మికులు



చిన్నశంకరంపేటలో..



రామాయంపేటలో..



పాపన్నపేటలో..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో..



శివ్వంపేటలో..



కౌడిపల్లిలో ..

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మేజర్ పంచాయతీలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో రియాజొద్దీన్, పంచాయతీ ఈఓ కమలాబాయి ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వీధుల గుండా, మురుగు కాల్వల వెంబడి చెత్తా చెదారం వేయకూడదన్నారు. ఇళ్ల చుట్టూ ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలంలో పలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆర్థికసాయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్‌కు చెందిన ఎరుకల పెంటయ్య (75) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన ఎరుకల సంఘం సభ్యులు బుధవారం మృతుడి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎల్లాదాసు, భిక్షపతి తదితరలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



బ్యాంకు సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ రంగ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఎల్టీ జోన్ చైర్ పర్సన్ డాక్టర్ సుబ్రహ్మణం అన్నారు. యూనియన్ బ్యాంకు ఇండియా స్థాపించి 44 ఏళ్లు పూర్తి చేసుకున్నందున బుధవారం మండల పరిధిలోని దొంతిలోని యూనియన్ బ్యాంకు సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుబ్రహ్మణం మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ బ్యాంకు ద్వారా ప్రజలకు లాభదాయకమైన రుణాలు ఇవ్వడం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజన్ శిరీషతో పాటు నూతనంగా వచ్చిన మేనేజర్ అమృతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు



వెల్మకన్న ఉన్నత పాఠశాలలో..

పెద్దశంకరంపేట(మెదక్): ఉద్యోగులకు బదిలీలు సహజమని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రాజేశ్వర్, బాలుర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మారుతి అన్నారు. బుధవారం పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు శంకర్, సిద్ధిరాములు, ప్రమోద్‌లను సన్మానించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సరోజా ఆధ్వర్యంలో వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సన్మానించారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని కుకునూర్ ప్రాథమిక పాఠశాలలో నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం శ్రీలతతో పాటు ఐదుగురు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సీతారాం, ఉపాధ్యాయ సిబ్బంది చంద్రశేఖర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నర్సాపూర్ మాజీ సర్పంచ్ మృతి**



సంజీవరావు(ఫైల్)

నర్సాపూర్: పట్టణంలోని మాజీ సర్పంచ్ చౌటి సంజీవ రావు (80) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన ఇటీవల అస్వస్థతకు గురై మంగళవారం రాత్రి ఆయన మరణించారని కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయన అంత్యక్రియలు బుధవారం పట్టణంలో నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, ఆయా పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, మాజీ వార్డు సభ్యులు పరామర్శించారు.

◆ **మట్టి టిప్పర్ సీజ్**

చిన్నశంకరంపేట(మెదక్): అర్ధరాత్రి అక్రమ మట్టి రవాణ చేస్తున్న టిప్పర్‌ను నార్సింగి పోలీస్‌లు సీజ్ చేశారు. నార్సింగి మండలం జప్తిశివనూర్ గ్రామ శివారులోని అమ్మకుంట నుంచి మంగళవారం అర్ధరాత్రిలో టిప్పర్‌లతో పెద్దఎత్తున అక్రమ మట్టి రవాణా చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు టిప్పర్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్‌రెడ్డి, ఆర్‌ఐ నవీన్ అమ్మకుంటను పరిశీలించారు. సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల మట్టిని అక్రమంగా తరలించినట్లు అంచనవేసినట్లు తెలిపారు.

◆ **అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు**

మనోహరాబాద్(తూప్రాన్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాయపల్లి శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో వెళ్లగా, టిప్పర్ దొరికినట్లు తెలిపారు. దీంతో టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ **సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి**



చిన్నశంకరంపేట(మెదక్): సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాబృందం అధికారి సురేందర్ కోరారు. బుధవారం చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో సైబర్ క్రైమ్, షీటీమ్ వినియోగం, మహిళల ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్, హెచ్‌సీ నర్సింలు, ఉపాధ్యాయులు పోచయ్య పాల్గొన్నారు.

◆ **నివాళి**

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం లూయిస్ డాగురె వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఫొటో గ్రాఫర్ మండలాధ్యక్షులు నర్సాగౌడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ జూకాస్ మండే డాగురే గమట్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు నర్సాగౌడ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్ కోశాధికారి మహేశ్‌గౌడ్, మండల ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.



◆ **ఏడాది నుంచి బార్ మూత**

నర్సాపూర్: బార్ మూతపడడంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతున్నా సంబంధిత శాఖ అధికారులు బార్‌ను తెరిపించేందుకు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నర్సాపూర్ పట్టణానికి బార్ కేటాయించగా పట్టణానికి చెందిన విజయ్‌శేఖర్‌గౌడ్‌కు బార్‌ను పలువురు భాగస్వాములతో నడిపారు. భాగస్వాములకు తలెత్తిన సమస్యలతో సమారు ఏడాది నుంచి బార్ మూతపడింది. ఈ విషయమై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పద్మను వివరణ కోరగా.. బార్ యజమాని లైసెన్సు రెన్యువల్ కోసం రెంటల్ చెల్లించారని తెలిపారు. దీంతో ప్రభుత్వానికి ఎలాంటి నష్టం ఉండదని ఆమె చెప్పారు.